గణపతి బప్పా మోరియా



సిరిసిల్లఅర్బన్‌: చంద్రంపేట ఊడుల చెరువులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

• గణేశునికి ఘనంగా వీడ్కోలు • అలరించిన కోలాటాలు.. డోలు విన్యాసాలు • కనులపండువగా శోభాయాత్రలు

'గణపతి బప్పా మోరియా.. అగ్లా వర్షీ లౌకరియా..' అంటూ గణేశునికి భక్తులు వీడ్కోలు పలికారు. నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులను జిల్లాలో గురువారం వైభవంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై నెలకొల్పిన వినాయకుల శోభాయాత్రలో యువతీయువకులు నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య కొనసాగింది. దారిపొడవునా టపాకాయలు కాలుస్తూ యువత నృత్యాలు చేస్తూ భక్తిసంద్రంలో మునిగితేలారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవరోధాలు జరగకుండా పోలీసుల బందోబస్తు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే వేములవాడ పట్టణంలో వరుసగా రెండు రోజుల పాటు నిర్వహించిన నిమజ్జనోత్సవంలో మహిళలు, విద్యార్థినులు కోలాటాలతో, డోలు కళాకారుల డోలు విన్యాసాలతో వినాయకుడికి వీడ్కోలు పలికారు. దీంతో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వినాయక ప్రతిమలను రాజన్న గుడి చెరువులో నిమజ్జనం చేస్తునే ఉన్నారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేశ్, సీఐ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తమతమ సిబ్బందిని అభినందించారు.

– సిరిసిల్ల/వేములవాడ/సిరిసిల్లఅర్బన్/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/ముస్తాబాద్/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/బోయినపల్లి/వీర్నపల్లి



ఎల్లారెడ్డిపేటలో శోభాయాత్ర



వేములవాడరూరల్‌లో..



తంగళ్లపల్లిలో వేలం పాడిన లడ్డూతో చిన్నారి



సిరిసిల్లలో గణేశ నిమజ్జనం



వేములవాడ: శోభాయాత్రలో డోలు కళాకారుల విన్యాసాలు



వేములవాడఅర్బన్‌: అనుపురంలో..



వీర్నపల్లిలో గణపతి లడ్డూతో రాజు



బోయినపల్లి: ఛత్రపతి శివాజీ యూత్ గణపతి



సిరిసిల్లలో..



ముస్తాబాద్‌: తుర్కపల్లిలో

వైభవంగా అనంత పద్మనాభస్వామి వ్రతం

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉన్న అనంతపద్మనాభ స్వామి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. బాద్రపద శుద్ధ చతుర్దశి సందర్భంగా ఆలయంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సామూహికంగా అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సామ కవిత, గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్

కోనరావుపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నుంచి చేపట్టనున్న సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ 2022 మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల వేతనాలు పెంచుతున్నామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. జీవో నెం.8 ప్రకారం కార్మికులకు పెంచిన వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. పాఠశాలలో వంట షెడ్లు నిర్మించి, వంట పాత్రలను అందించాలని కోరారు. అలాగే కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్, కార్మికులు గొట్టె బాలమణి, దేవవ్వ, రాధ, లక్ష్మి, నర్సవ్వ, దేవేంద్ర పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

గుర్రం జాషువా జయంతి

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌లో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు గురువారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దళిత సంఘం నాయకుడు నల్ల బాబు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఏవిధంగా అణచివేతకు గురవుతున్నారో తన కవితలు, రచనలతో చైతన్య పరిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మాజీ సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి భూవిరాళం

ముస్తాబాద్‌: మండలంలోని గూడెంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి కటకం ఎల్లయ్య రెండు గుంటల స్థలాన్ని అందజేశాడని ఆలయ కమిటీ చైర్మన్ లింగంపల్లి ఎల్లాగౌడ్ తెలిపారు. చిట్నేని చలన్‌రావు రూ.4.60 లక్షలుధనలక్ష్మి రైస్‌మిల్ యజమాని రూ.25 వేలు, దర్జీ సంఘం రూ.11 వేలు, శాలివాహన సంఘం రూ.10 వేలు, లింగంపల్లి ఎల్లాగౌడ్ రూ.9 వేలు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, ఎల్లంకి శ్రీనివాస్, రాజిరెడ్డి రూ.5 వేల చొప్పున విరాళాలను అందజేశారన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా డబుల్ పట్టాల పంపిణీ

గంభీరావుపేట: మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ రసాభాసాగా సాగుతోంది. అధికారులు లబ్ధిదారుల జాబితాను గురువారం వరకు బహిరంగ పరుచకపోవడంతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పట్టాల పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఉదయాన్నే దరఖాస్తుదారులు కార్యాలయం ముందు బారులుదీరారు. ఎట్టకేలకు జాబితా ప్రకటించి అధికారులు పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. అర్హులైన తమకు రాలేదంటూ పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికి 206 మంది లబ్ధిదారులను ఎంపిక జరిగిందని పట్టాల ప్రక్రియ కొనసాగుతోందని తహసీల్దార్ భూపతి తెలిపారు. అర్హులైన తమకు న్యాయం చేయాలంటూ దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దరఖాస్తుదారులు

'మతి తప్పి మాట్లాడుతున్న మంత్రి'



మాట్లాడుతున్న రొడ్డ రామచంద్రం

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ మతి తప్పి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రొడ్డ రామచంద్రం విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో గురువారం మాట్లాడారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే మంత్రి కేటీఆర్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను చూసి బీఆర్‌ఎస్ నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నాయకులు షేక్ గౌస్, దొమ్మాటి నరసయ్య, సద్ది లక్ష్మారెడ్డి, సూడిద రాజేందర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సైలు

ఎల్లారెడ్డిపేట: ఫొటోగ్రఫీ ఎక్స్‌ప్రో పోస్టర్‌ను ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ గురువారం ఆవిష్కరించారు. మండలకేంద్రంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సభ్యులు మహమ్మద్ ఫక్రొద్దీన్, మహమ్మద్ షాదుల్, పాలోజీ శ్రీనివాస్, మారోజు నరసింహచారి, మహమ్మద్ అజ్జూ, పెంజర్ల తిరుపతి, మారోజు కుబేరస్వామి, షాడ శేఖర్‌రెడ్డి, విజయ శ్రీధర్, బస్వపొరం కృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దొడ్ల సంజీవ్‌ను సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్ గురువారం సన్మానించారు. సంజీవ్ గొల్లపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్నాడు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

• చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మండలంలోని మల్లాపూర్ పరిధిలోని రేగులపల్లి, ఐలవానిపల్లి గ్రామాల నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మిడ్‌మానేరు పరిసరాల్లో మానేరు వాగు నుంచి వచ్చే నీటితో ఖాజీపూర్ రోడ్డు బురదమయం అవుతోందని, ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని మల్లాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లెందుల శంకరయ్య ఎమ్మెల్యేకు వివరించగా ఆయన పైవిధంగా స్పందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, సింగిల్‌విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, బెంద్రం మాధవరెడ్డి, జంగిటి సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

అడ్డంకుల తొలగించే బాధ్యత ప్రభుత్వానిదే

సిరిసిల్లఎడ్యుకేషన్‌: ప్రస్తుతం జరుగుతున్న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత ఉండాలన్న అంశంపై ప్రభుత్వం చొరవ తీసుకొని తగు మినహాయింపులు ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల శివ నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో టెట్ తప్పనిసరి కాదన్నారు. ప్రస్తుతం యధావిధిగా టెట్ లేకుండా ప్రమోషన్లు ఇచ్చి 10 సంవత్సరాల వరకు టెట్ పొందే అవకాశాన్ని ఉపాధ్యాయులకు ఇవ్వవచ్చు అని అన్నారు. ..లేదా ప్రభుత్వం మరొక గొప్ప ముందడుగు వేసి టెట్‌ని ఇన్ సర్వీస్ టీచర్లకు డిపార్ట్మెంటల్ టెస్ట్ గా మార్చి ఓపెన్ బుక్ పద్ధతిలో పరీక్ష పెట్టి సరిచేయడానికి వీలుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దోర్నాల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రమనాథ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వేణుగోపాలరావు, జిల్లా నాయకులు పురం వాసుదేవరావు పాల్గొన్నారు .

సంక్షిప్త వార్తలు

13 మందికి ప్రమోషన్

గంభీరావుపేట: మండలం నుంచి రికార్డు స్థాయిలో 13 మంది పీజీహెచ్ఎంలుగా ప్రమోషన్ సాధించారు. ఇటీవల జరిగిన పీజీ హెచ్ఎంల పదోన్నతులలో అత్యధికంగా 13 మంది పీజీహెచ్ఎంలుగా ప్రమోషన్ పొందారు.

చలో హైదరాబాద్

ముస్తాబాద్‌: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కొరుతూ హైదరాబాద్‌లో తలపెట్టిన ఆటో డ్రైవర్ల యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 8న తలపెట్టిన ఆటో డ్రైవర్ల యూనియన్ మహాసభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.

గడప గడపకు కాంగ్రెస్

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుల వెంకటి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్‌: రాబోయే కాంగ్రెస్ పథకాలపై ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలం గోపాల్‌పల్లె, జగదాంబతండాలో నిర్వహించారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని వేడుకోలు

తంగళ్లపల్లి: తన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మండల కేంద్రానికి చెందిన ఎగుర్ల కనకయ్య అనే వ్యక్తి మీడియా ముందు వాపోయాడు. గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడుతూ తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 311లో తనకు తన అన్నకు ఎకరం భూమి ఉందని తెలిపాడు. ఆ భూమి పంపకాల విషయమై ఐదేళ్లుగా వివాదం నెలకొనగా శని గరం తిరుపతి అనే వ్యక్తి ఎనిమదిన్నర గుంటల స్థలంలో నిర్మాణం చేపడుతున్నాడని ఆరోపించాడు. ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవాడం లేదని ఆరోపించాడు.

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



గంభీరావుపేట: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా తమను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేయడంపై ప్రతిపక్షాల నాయకులు భగ్గుమన్నారు. మండల కేంద్రంలో గురువారం మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించడానికి మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా పోలీసులు అర్ధరాత్రి పూట ఇళ్లలకు వచ్చి అరెస్టులు చేయడం, మొబైల్ ఫోన్లు లాక్కోవడం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలంటే అధికార పార్టీకి ఎందుకు భయమని ప్రశ్నించారు. గంభీరావుపేట పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కర్రొల్ల రాజు, రాజబాబు, బీజేపీ నాయకుడు మహేశ్‌యాదవ్, బీసీ సేన నాయకుడు బట్టు ప్రవీణ్ పాల్గొన్నారు.

కేసు నమోదు

వేములవాడ: నిమజ్జనం సందర్భంగా పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన మారం కుమార్, దినేష్, కొండా ప్రశాంత్, పసులేటి క్రాంతి, రాజు, పిల్లి శ్రీకాంత్, గొట్టం ప్రశాంత్, గొట్టం శివ మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. కోనాయపల్లి రోడ్డులో హెడ్ కానిస్టేబుల్ గంగారాం విధులకు ఆటంకం కల్గించిన కడమంచి వంశీ, వానరాసి వెంకటయ్య, శ్రీనివాస్, మోతె సంపత్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.